ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 01.04.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రేపటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

2. వాహనాలకు వినియోగించే ఎల్పీజీ కొరతను తీర్చేందుకు రాష్ట్రానికి కేటాయింపులు పెంచాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్రాన్ని కోరారు.

3. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

4. దేశంలో క్రిటికల్ మినరల్ రీసైక్లింగ్ కేంద్రాలు ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

**భట్టి విక్రమార్క**

ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రేపటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. నిన్న సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంత వరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు.

ఇప్పటి వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలన్నారు.

డెస్క్

**ఉత్తమ్**

తెలంగాణలో ఆటోలకు వినియోగించే ఎల్పీజీ కొరత తీవ్రంగా ఉండటంతో రవాణా సేవలు దెబ్బ తింటున్నాయని, ఆటోడ్రైవర్ల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతోందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేంద్ర చమురు, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పురీకి నిన్న లేఖ రాశారు. రాష్ట్రంలో రోజు సుమారు 55 టన్నుల గ్యాస్ లోటు ఏర్పడుతోందని అందులో వివరించారు. గ్యాస్ తీవ్ర కొరతతో ఆటోలు ప్రైవేట్ ఔట్‌లెట్ల దగ్గర భారీగా నిరీక్షిస్తున్నారని, ప్రైవేటు బంకులు ధరలు విపరీతంగా పెంచుతున్నాయని, ప్రభుత్వ బంకుల్లో లీటరుకు 75 రూపాయలు ఉంటే, ప్రైవేట్ కంపెనీలు 93 రూపాయల వరకు వసూలు చేస్తున్నాయని, దీన్ని నియంత్రించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కేంద్రాన్ని కోరారు.

డెస్క్

**వాకిటి శ్రీహరి**

మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా 290 కోట్ల మంది మహిళలు పది వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్న సందర్భంగా మక్తల్ లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ...

Bytes ... వాకిటి శ్రీహరి

పిటిసి, మహబూబ్ నగర్

**కిషన్ రెడ్డి**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నిన్న ఉత్తరప్రదేశ్ లోని గ్రేటర్ నోయిడాలో ఉన్న లోహమ్ కంపెనీ R&D కేంద్రాన్ని, అలాగే లిథియం, కోబాల్ట్ రిఫైనరీలను సందర్శించారు. ఈ సందర్భంగా, సుస్థిరమైన, పర్యావరణహిత విధానాల ద్వారా కీలక ఖనిజాల భద్రతను సాధించేందుకు భారత ప్రభుత్వం మిషన్ మోడ్ లో పనిచేస్తున్న తీరును కేంద్రమంత్రి వివరించారు. ఈ దిశగా క్రిటికల్ మినరల్ రీసైక్లింగ్ కేంద్రాలు ప్రత్యేక కార్యాచరణతో పని చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా కిషన్... రెడ్డి అక్కడి సైంటిస్టులు, ఇంజినీర్లు, R&D సిబ్బందితో మాట్లాడి, ఉపయోగించిన బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుండి లిథియం, కోబాల్ట్ ను రీ సైక్లింగ్, రీ పర్పసింగ్ చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా లిథియం ఉత్పత్తి చేస్తున్న అతిపెద్ద సంస్థ అయిన LOHUM సంస్థ ద్వారా జరుగుతున్న ప్రయత్నాలను కేంద్రమంత్రి ప్రశంసించారు. ఈ రీసైక్లింగ్ ద్వారా.. క్రిటికల్ మినరల్స్ కోసం దిగుమతులపై ఆధార పడటం తగ్గడంతో పాటుగా.. డొమెస్టిక్ సప్లయ్ చైన్స్ బలోపేతం అవుతుందని మంత్రి వెల్లడించారు.

డెస్క్

**అడ్లూరి**

జగిత్యాల జిల్లాలో ఆకాల వర్షాలు, వడగళ్ల వర్షం కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం భీమరాజుపల్లి గ్రామంలో నష్టపోయిన పంటలను  అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 6 వేల 160 ఎకరాల్లో మామిడి, ఒక వెయ్యి 29 ఎకరాల్లో వరి, 1520 ఎకరాల్లో మొక్కజొన్న, 581 ఎకరాల్లో నువ్వుల పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారని మంత్రి తెలిపారు. యుద్ధ ప్రాతిపాదికన అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**పిటిసి, జగిత్యాల**

**గ్రామీణాభివృద్ధి - అవార్డులు**

కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలలో భాగంగా పలు విభాగాల్లో మన రాష్ట్రంలోని పలు గ్రామ పంచాయితీలకు అవార్డులు సాధించాయి. వికారాబాద్ జిల్లా, మోతుకుపల్లి గ్రామ పంచాయతీ గుడ్ గవర్నెన్స్ విభాగంలో అవార్డు సాధించింది. అలాగే సంగారెడ్డి జిల్లా, ఘసల్వాడి గ్రామ పంచాయతీ విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికైంది. రెండు విభాగాల్లో తెలంగాణకు అవార్డులు రావడం పట్ల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

డెస్క్

**HYD**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు నుంచి కేరళలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. మొదటి రోజు కాంగ్రెస్ పార్టీ తరుపున ముట్టతార రోడ్‌షోలో పాల్గొన్నారు. అభివృద్ధి చేసే వారికే ఓటు వేయాలని కేరళ ప్రజలను కోరారు.

పిటిసి, హైదరాబాద్

**హైడ్రా**

హైదరాబాద్, మైలార్ దేవుపల్లిలోని విలేజ్ శాస్త్రిపురం కాలనీలో హైడ్రా ఈ ఉదయం భారీ ఆపరేషన్ నిర్వహించింది. 6 వేల 500 గజాల క్రీడా మైదానాన్ని కాపాడింది. దీని విలువ 100 కోట్ల రూపాయల వరకు వుంటుందని అధికారులు అంచనా వేశారు. 188 ఎకరాల హుడా అనుమతి పొందిన లేఔట్లో క్రీడాస్థలం కోసం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది. జీ ప్లస్ 3 అంతస్తుల నిర్మాణ దశలో ఉన్న భవనాలు ఐదింటిని జేసీబీ లతో తొలగించారు. మరో రెండు సింగిల్ రూమ్ నిర్మాణాలను కూడా తొలగించారు. క్రీడామైదానం అందుబాటులోకి రావడంతో శాస్త్రిపురం కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

పిఎన్

**సలేశ్వరం జాతర ప్రారంభం**

నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలో నల్లమల్ల అడవిలో కొలువైన సలేశ్వర లింగమయ్య జాతర ఈరోజు ప్రారంభమైంది. చెంచులే పూజారులుగా శివలింగానికి మూడు రోజుల పాటు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఈ జాతరకు వేలాది మంది భక్తులు లోయలు, ఎత్తైన కొండల కొండల గుండా కాలినడకన చేరుకొంటున్నారు. తెలంగాణ అమర్‌నాథ్ సాహస యాత్రగా పిలువబడే ఈ క్షేత్ర దర్శనంతో తమ కోరికలు తీరుతాయని భక్తులు విశ్వసిస్తారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టారు. నాగర్‌కర్నూల్ నుండి 25 ఆర్టీసి బస్సులను నడిపిస్తున్నారు.

పిటిసి, నాగర్ కర్నూల్

**పంట నష్టం - జగిత్యాల**

జగిత్యాల జిల్లాలో అకాల వర్షం రైతులకు భారీ నష్టం కలిగించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో జిల్లాలోని పలు మండలాల్లో వివిధ పంటలు నేలవాలాయి. జిల్లాకు చెందిన రైతు మామిడి నర్సయ్య ప్రభుత్వం రైతులను తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బైట్ ... మామిడి నర్సయ్య

పిటిసి, జగిత్యాల

**ఘంటా చక్రపాణి**

డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చంచల్‌గూడ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదిల్లో "ఆర్థిక సంస్కరణలు, భారత రాజ్యాంగం: విభేదాలు, భవిష్యత్ దిశ" అనే అంశంపై నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సు కు సంబంధించి బ్రోచర్‌ను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ.ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొ.చక్రపాణి మాట్లాడుతూ... ఆర్థిక సంస్కరణలు రాజ్యాంగ పరిమితులతో సమన్వయం సాధిస్తూ సమగ్ర, సమాన అభివృద్ధిని సాధించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ సదస్సు

ద్వారా ఆర్థిక సంస్కరణలు, రాజ్యాంగ పరిమితుల మధ్య ఉన్న సంబంధాలు, సవాళ్లు, అలాగే భవిష్యత్ అవకాశాలపై లోతైన చర్చలు జరగనున్నాయని సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వెంకటేశ్వర్లు తెలిపారు.

జీఎస్

**జాతీయ నడక దినోత్సవం**

ఈరోజు జాతీయ నడక దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ మొదటి బుధవారం దీనిని జరుపుకుంటారు. శారీరక వ్యాయామం, ముఖ్యంగా నడక ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి ఈరోజును నిర్వహిస్తారు. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి 30 నిమిషాల నడకను సూచిస్తుంది. నడక ద్వారా శారీర, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడం ఈరోజు ముఖ్య ఉద్దేశ్యం. ఫలితంగా గుండె జబ్బులను నివారించడం, ఒత్తిడిని తగ్గించడం, శరీరానికి శక్తిని ఇవ్వడం వంటివి చేకూరుతాయి. నడక అనేది చాలా సులభమైన, ఎటువంటి ప్రత్యేక పరికరాలు అవసరం లేని వ్యాయామం.

జీఎస్

**భద్రాద్రి కొత్తగూడెం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఉదయం స్వామి వారికి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం సూర్య ప్రభ వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భద్రాద్రి రామయ్య భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, నిన్న రాత్రి 'ఊంజల్ సేవ'ను నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో స్వామి వారిని.. అమ్మవార్లను ఆశీనులను చేసి వేదమంత్రాల మధ్య డోలోత్సవం నిర్వహించారు.

**పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం**

**చిన్న హన్మాన్ జయంతి**

జగిత్యాల జిల్లా కొండగట్టు చిన్న హన్మాన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో తెలిపారు. ఇదిలా వుండగా నిన్న రాత్రి భారీ ఈదురు గాలులు రావడంతో ఆలయ పరిసరాల్లో భక్తుల వసతి కోసం ఏర్పాటు చేసిన పందిర్లు నేలకూలాయి. దీంతో ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. అత్యవసర ఏర్పాట్లపై దృష్టి సారించారు.

పీటీసీ, జగిత్యాల

**కరెంటు చార్జీలు**

రాష్ట్రంలో ఈరోజు నుంచి కొత్త కరెంటు ఛార్జీలు అమల్లోకి వచ్చాయి. హైటెన్షన్ కరెంటు కనెక్షన్ తీసుకున్న 6 కేటగిరీల ఛార్జీల్లో మార్పులు చేస్తూ ఈఆర్‌సీ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది.

డెస్క్